క్లుప్తంగా

పెయ్యి దూడల పెంపకంపై అవగాహన



నెల్లూరు(సెంట్రల్): పెయ్యి దూడల పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వెటర్నరీ పాలిక్లీనిక్ డీడీ డాక్టర్ సోమయ్య పేర్కొన్నారు. వెంకటేశ్వరపురంలో మంగళవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరంలో ఆయన మాట్లాడారు. 84 పశువులను పరీక్షించి, 49 లేగ దూడలకు నట్టల నివారణ మందును తాగించామని చెప్పారు.

పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన



నెల్లూరు (టౌన్): మూలాపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఎంఈఓ – 2 అబ్దుల్ హమీద్, హెచ్ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

కాకాణితో విజయకుమార్‌రెడ్డి భేటీ



నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పార్టీ నెల్లూరు నగరాధ్యక్షుడిగా 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్‌ను నియమించాలని ప్రతిపాదించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

మీనాక్షి సుందరేశ్వరుడికి పూజలు



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ధ్వజారోహణను మంగళవారం నిర్వహించారు. కొడిముద్దల నివేదన, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్ర హోమం, మహానివేదన తదితర పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝ్జుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. రావణసేవను రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా మేడికొండ పద్మమోహన్, స్నేహ దంపతులు వ్యవహరించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయంలో మహాశివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో మంగళవారం ప్రారంభించారు. పుష్పాలు, చాక్లెట్లతో శివరూపాన్ని నయనానందకరంగా తీర్చిదిద్దారు. స్వామివారికి హారతులిచ్చారు. ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ ప్రొఫెసర్ విజిత, రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ ఇన్‌చార్జి ప్రసన్న, కోవూరు ఇన్‌చార్జి రాధిక, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా మూలస్థానేశ్వరాలయం



మహాశివరాత్రి శోభ

మహాశివరాత్రిని పురస్కరించుకొని నగరంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగోద్భవాభిషేకాలు, విశేష పూజలు, అర్చనలను వేడుకగా బుధవారం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. మూలాపేటలోని మూలస్థానేశ్వరాలయం విద్యుద్దీపాలతో శోభిల్లుతోంది.

– నెల్లూరు(బృందావనం)



క్యూలైన్లు

ప్రణాళికబద్ధంగా బడ్జెట్ రూపకల్పన

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా నిర్వహించేలా నూతన బడ్జెట్‌ను రూపొందించేందుకు కృషి చేస్తున్నామని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. బడ్జెట్ రూపకల్పనపై అన్ని విభాగాల ఉన్నతాధికారులతో తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వనున్నామని వెల్లడించారు. అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను రూపొందించనున్నామని ప్రకటించారు.



మాట్లాడుతున్న స్రవంతి

హాకీ రాష్ట్ర మహిళా జట్టు ఎంపిక



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): హరియాణాలో మార్చి ఒకటి నుంచి నిర్వహించనున్న జాతీయ సీనియర్స్ మహిళా పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును మంగళవారం ప్రకటించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో హాకీ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోచింగ్ క్యాంప్ ముగిసింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు దుస్తులను అందజేశారు.

జట్టుకు ఎంపికైన వారు..

రమ్య (శ్రీకాకుళం), మేరీ భవానీ కుసుమ (అనకాపల్లి), లక్ష్మీరేవతి (అనంతపురం), వరాలమ్మ నందిని (కాకినాడ), కల్యాణి (విశాఖపట్నం), పావని (సత్యసాయి), హారతి నందిని (కడప), దుర్గా భవానీ (ఎన్టీఆర్), రుక్మిణి (తిరుపతి), ప్రగతి శర్వాణి (నెల్లూరు), ముజియాబేగం (ప్రకాశం). జట్టు కోచ్, మేనేజర్లుగా అనిల్‌కుమార్ (అనంతపురం), రవికుమార్ (ప్రకాశం), రమ్య (నెల్లూరు) వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ నాయక్, ఎంఈఓ తిరుపాల్, డీఎస్డీఏ యతిరాజ్, హాకీ నెల్లూరు కార్యదర్శి జగన్ మోహన్, హాకీ కోచ్ చందు, వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, నాగేంద్రరావు, నెల్లూరు హాకీ డైరెక్టర్ థామస్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

'వెలుగొండ'ను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న రమేష్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా పరిధిలో వెలుగొండ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయాలని, దీనికి రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని పలు రాజకీయ పార్టీ నేతలు, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం దీన్ని తక్షణమే పూర్తి చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నేతలు వెంగయ్య, వెంకమరాజు, పుల్లయ్య, శివకుమారి, మస్తాన్‌బీ, శేషయ్య, చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు నేత్ర వైద్యశిబిరాన్ని పొట్టి శ్రీరాములు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మోడరన్ ఐ హాస్పిటల్ సహకారంలో మంగళవారం నిర్వహించారు. దాదాపు 300 మందికి నేత్ర పరీక్షలు జరిపారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, ఇమ్రాన్, మోడరన్ ఆస్పత్రి పీఆర్వో రవికుమార్, గౌరవాధ్యక్షుడు నారాయణ, క్లబ్ సభ్యులు రవి, సుబ్రహ్మణ్యం, హరినాథ్‌రెడ్డి, రామచంద్రయ్య, శ్రీమన్నారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఈఓ అసోసియేషన్ ఎన్నిక



నెల్లూరు(క్రైమ్): ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలను నెల్లూరు క్లబ్‌లో మంగళవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఏఈఎస్ రమేష్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఇందుకూరుపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా నెల్లూరు – 1 ఎక్సైజ్ ఎస్సై ప్రభాకర్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఇన్‌స్పెక్టర్ సుంకర శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా ఎస్సై గంగాధర్, కోశాధికారిగా ఎస్సై మహబూబ్‌బాషా, ఈసీ మెంబర్లుగా ఇన్‌స్పెక్టర్లు ప్రసన్నలక్ష్మి, లక్ష్మణస్వామి, అబ్దుల్ జలీల్ అహ్మద్, కాలేషావలీ, ఎస్సైలు శేషమ్మ, ప్రతాప్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

శివాలయాల వద్ద పటిష్ట భద్రత

నెల్లూరు(క్రైమ్): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని శివాలయాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టామని వివరించారు. నిర్దేశించిన ప్రాంతాల్లో వాహనాలను నిలపాలని సూచించారు.

సోలార్ ప్యానళ్ల వెండార్లతో సమావేశం



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పీఎం సూర్యఘర్ సోలార్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసే కంపెనీలు వారి ధరల పట్టికలను తెలియజేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ విజయన్ కోరారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో సోలార్ వెండార్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోలార్ ప్యానళ్ల ఏర్పాటుతో విద్యుత్ సంస్థకు ఎలాంటి సంబంధం ఉండదని, నగదు చెల్లించాక రసీదులను వినియోగదారులు పొందాలని సూచించారు. ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యాక డీఈఈ పర్యవేక్షించనున్నారని చెప్పారు. సబ్సిడీ రూపంలో కేంద్ర ప్రభుత్వం అందజేసే నగదు వారి బ్యాంక్ ఖాతాల్లో 15 రోజుల్లో జమవనుందని, మీటర్ ఏర్పాటుకు మాత్రమే విద్యుత్ సంస్థకు నగదును చెల్లించాల్సి ఉంటుందన్నారు. సూర్యఘర్ సోలార్ జిల్లా నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్, డీఈఈలు అశోక్, సునీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): మనస్పర్థలతో పిన్ని, ఆమె కుమార్తెను గొడ్డలితో చంపేస్తానని బెదిరించిన వ్యక్తిపై కేసును వేదాయపాళెం పోలీసులు మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళేనికి చెందిన పద్మమ్మ, నాగేశ్వరరావు దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. నాగేశ్వరరావు గుండెపోటుతో 2014లో మృతి చెందారు. అంగన్వాడీ స్కూల్లో ఆయాగా పనిచేస్తూ కుటుంబాన్ని పద్మమ్మ పోషిస్తున్నారు. బావ కుమారుడు వెంకటరామయ్య కుటుంబానికి, ఆమెకు మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో వెంకటరామయ్య తన పిన్ని ఇంట్లోకి ఈ నెల 14వ తేదీ రాత్రి అక్రమంగా ప్రవేశించి గొడ్డలితో కిటికీ, తలుపులను పగలగొట్టేందుకు యత్నించారు. అడ్డుకున్న పద్మమ్మ, ఆమె కుమార్తెను చంపుతామని బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను బుధవారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సెలవైనా, జిల్లాలోని బిల్లుల వసూలు కేంద్రాలు పనిచేయనున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


బకాయిదారుల కుళాయి కనెక్షన్లను తొలగించండి



మాట్లాడుతున్న చెన్నుడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను మొండి బకాయిదారుల గృహాలకు సంబంధించిన తాగునీటి కుళాయి కనెక్షన్లను తొలగించాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు ఆదేశించారు. నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగాధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయాల పరిధిలోని అడ్మిన్ కార్యదర్శులు తమకు నిర్దేశించిన లక్ష్యాలు, వసూళ్ల వివరాలను సంబంధిత ఆర్ఐకు రోజూ తెలియజేయాలని సూచించారు. వచ్చే నెలాఖరు నాటికి లక్ష్యాలను నూరు శాతం సాధించాలని చెప్పారు. రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వెండి రావణసేవ



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో స్వామివారు వెండి రావణసేవలో మంగళవారం దర్శనమిచ్చారు. చప్పరోత్సవాన్ని ఉదయం నిర్వహించారు. ఉభయకర్తలుగా శ్రీకాంత్, సౌందర్య దంపతులు, రేబాల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వంశీరెడ్డి, చైతన్యరెడ్డి వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

జిల్లాలోని పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ



మాట్లాడుతున్న గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని 76 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు గానూ 58 చోట్ల కంప్యూటరీకరణ ప్రక్రియ వచ్చే నెల ఏడు నాటికి పూర్తికానుందని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణపై గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కంప్యూటరీకరణతో సంఘ సభ్యుల వివరాలు, రుణాలు, రికవరీల్లో పారదర్శకత ఉంటుందన్నారు. డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం బాబు, జీఎం సరిత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలి




కార్మికుల నిరసన

నెల్లూరు(బారకాసు): సీనియార్టీ మేరకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు 5, 6, 7వ డివిజన్ల పారిశుద్ధ్య కార్మికులు తడికలబజార్ సెంటర్‌లో ధర్నాను ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు.

స్వర్ణలింగేశ్వరుడికి అభిషేకాలు





నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేశ్ ఘాట్ వద్ద కొలువైన స్వర్ణలింగేశ్వరస్వామికి త్రయోదశి అభిషేకాన్ని మంగళవారం నిర్వహించారు. గణపతి పూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, హోమాలను జరిపారు. స్వర్ణలింగేశ్వరస్వామి, నందీశ్వరుడికి మహన్యాసపూర్వక పంచామృతాభిషేకాలు, అర్చనలు తదితరాలను నిర్వహించారు. సురేందర్‌రెడ్డి, జనార్దన్‌రాజు, శ్రీనివాసులు, కామేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, సుజాత, వెంగళరెడ్డి, కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

చెత్త తరలింపు వాహనాల ట్రిప్పులు పెంచాలి



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించే వాహనాల ట్రిప్పుల సంఖ్యను మరింత పెంచాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని తొమ్మిదో డివిజన్లో గల బంగ్లా తోట, యనమలపాళెం, ఎఫ్‌సీఐ కాలనీ, నజీర్‌తోట తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలోని అన్ని పార్కుల్లో మౌలిక వసతులు, క్రీడా, వ్యాయామ పరికరాలు, వాకింగ్ ట్రాక్ తదితరాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అభిప్రాయ సేకరణలో అడ్మిన్ సెక్రటరీలు చురుగ్గా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించి విజయవంతమయ్యేలా కృషి చేయాలని కోరారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థపై అవగాహన కల్పించి, డ్రైనేజీ కనెక్షన్లను ప్రతి ఒక్కరూ తీసుకునేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. భవన నిర్మాణ సామగ్రి రోడ్లను ఆక్రమించకుండా చూడాలని తెలిపారు. అనధికారికంగా పార్క్ చేసిన వాహనాలను గమనించి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సాయంతో వాటిని తొలగించాలని చెప్పారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎంహెచ్ఓ చైతన్య, వెటర్నరీ వైద్యాధికారి మదన్‌మోహన్, ఉద్యాన శాఖ ఏడీ ప్రదీప్‌కుమార్, ఈఈ శ్రీనివాసరావు, డీఈఈలు రఘురామ్, ముజాహిద్దీన్, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, ఏసీపీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్లతో సమావేశం

పట్టణ, పురపాలక సంఘాల పరిధిలో సేకరించిన వ్యర్థాలను విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్లకు తరలించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. వ్యర్థాల నిర్వహణపై ఒంగోలు, కావలి, కందుకూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్లతో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలో మరో రెండేళ్లలో వ్యర్థాల ద్వారా విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్‌ను నిర్మించనున్నామని వెల్లడించారు. ఇది పూర్తయ్యేంత వరకు నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం సేకరిస్తున్న ఎనిమిది లక్షల టన్నుల వ్యర్థాలను గుంటూరులోని ప్లాంట్‌కు తరలిస్తున్నామని వెల్లడించారు. దీనికి గానూ 32 టన్నుల సామర్థ్యం గల కంపాక్టర్ వాహనాలను వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. వారి ప్రాంతాల్లోని వ్యర్థాల పరిమాణం, సేకరణ విధానం, రోజూ ఎంత సేకరిస్తున్నారు తదితర వివరాలను ఆరాతీశారు.

సమానావకాశాలు కల్పించాలి

నెల్లూరు రూరల్: అసెంబ్లీ, శాసనమండలి, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి అన్ని పత్రికలు, మీడియా ఛానళ్లకు సమానావకాశాలు కల్పించాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన స్టేట్ స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ (సామ్నా) సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరూ ఐకమత్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సామ్నా జిల్లా మాజీ అధ్యక్షుడు సర్వేపల్లి రామ్మూర్తికి సంతాపం ప్రకటించారు. సామ్నా గౌరవ సలహాదారులుగా రామారావు, గౌరవాధ్యక్షుడిగా సింహపురి బాబు, అధ్యక్షుడిగా వేలూరు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా చక్రం దినేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మనోహర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా సురేష్, శ్రీనివాసులు, మస్తానయ్య, ట్రెజరర్‌గా సునీల్ గవాస్కర్, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులుగా వినయ్, అక్మల్ నియమితులయ్యారు. వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, మస్తాన్‌రెడ్డి, హనోక్ తదితరులు పాల్గొన్నారు.



అతిథులు, సామ్నా నూతన కమిటీ

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నెల్లూరు సిటీ: కలివెలపాళెం, మాదరాజుగూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వ్యవసాయాధికారి నాగమోహన్ పేర్కొన్నారు. కలివెలపాళెం, మాదరాజుగూడూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. రైతులు విధిగా ఫార్మర్ రిజిస్ట్రీని చేయించుకోవాలని కోరారు. తెగుళ్లు తక్కువగా ఉన్నాయని, పురుగుమందులను ఎక్కువగా వినియోగించొద్దని సూచించారు. ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగమోహన్

పరీక్ష మెటీరియళ్ల పంపిణీ

నెల్లూరు సిటీ: పదో తరగతి పరీక్షలు విద్యార్థులకు చాలా కీలకమని రూరల్ సీఐ వేణు పేర్కొన్నారు. సౌత్‌మోపూరులోని వాణిశ్రీ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పరీక్ష మెటీరియళ్లను ఆల్తూరి ఆదిశేషయ్య ఫౌండేషన్, విస్సా వావిలేటిపాడు సౌజన్యంతో మంగళవారం పంపిణీ చేశారు. సౌత్‌మోపూరు పీహెచ్‌సీ వైద్యుడు హర్షద్, ఫౌండేషన్ చైర్మన్ ఆల్తూరి మస్తానయ్య, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్, కాకుపల్లి మాజీ సర్పంచ్ ఉప్పల ఈశ్వరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేణు